

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

" ఈ మధ్యన నీకు కాస్త పని ఎక్కువైనట్టుంది కదా యశూ! పోనీ వంటమనిషిని పెట్టుకోకూడదూ!?" పని వత్తిడి తో కొద్దిగా అలసినట్టుగా కనిపిస్తున్న భార్యని చూస్తూ అడిగాడు కేశవ్.

సన్నగా నవ్వింది యశోద.

" పరవాలేదు అండి. ఎందుకో నాకు వంట మాత్రం ఎవరికీ అప్పగించాలని అనిపించదు. రత్న, విజయ్ ఉన్నారు కదా, కావలసినంత హెల్ప్ చేస్తారు. నిజానికి పోపులు వేసి ముగించడమే నాకు ఉండే పని." అంది.

" నీ ఇష్టం మరి. ఊరికే హైరాన పడకు. వంటను మించిన పెద్ద ఆర్ట్ లేదు, అదే నా డిజైనర్ స్టుడియో అంటావు. ఇన్నాళ్ళు చేశావు కదా, ఇంకా కష్టపడటం ఎందుకు? పైగా ఈ మధ్యన కొత్తగా పని కూడా మొదలు పెట్టావు" అన్నాడాయన.

" ఆ మాట నిజమే కదా! ఇటు చూడండి. నేను కోరి కట్టించుకున్న నా ఈ వంట గది ఎంత బావుంటుందో కదా! ఈ పెద్ద తెల్లటి కిటికీలోంచి నేను ప్రేమ గా పెంచుకుంటున్న నా కిచెన్ గార్డెన్ లో పెరుగుతున్న కూరగాయలు, ఆకుకూరలు, మెడిసినల్ ప్లాంట్స్ ఇవన్నీ చూస్తూ మనందరికీ వంట చెయ్యడం ఎంత థెరపీలా అనిపిస్తుందో నాకు. ఈ కిటికీ పక్కన నేను ఇష్టపడి పెట్టుకున్న నైట్ క్వీన్ రాత్రి కిటికీ తెరిస్తే పరిమళం పంచుతుంటే నాకు అలసటన్నదే తెలియదు కదా!" అంది

" నీకు చెప్పి లాభం లేదు" అన్నట్టు భుజాలెగరేసి నవ్వారు ఆయన.

ఆ తర్వాత కాఫీ తాగుతూ వంటగది నలుదిక్కులా చూశారు మరోసారి.ఆమె చెప్పిన దాంట్లో ఏమీ అబద్ధం లేదు.

విశాలంగా ఉన్న గది, లేత రంగులతో మెరుస్తున్న గోడలు, ఒక పక్కగా ఏర్పాటు చేసిన కాఫీ స్టేషన్, దానిపైన గోడల మీద ఆవిడ స్వయంగా పెయింట్ చేసిన కాఫీ కప్పులు, కెటిల్ డిజైన్లతో ప్రత్యేకంగా కనిపిస్తోంది.

డిజైనర్ కిచెన్ లో ప్రతీ వస్తువుకీ ప్రత్యేకమైన చోటు ఉండేలా రూపొందించిందావిడ. కిటికీలోంచి కనిపించే కిచెన్ గార్డెన్, పూల మొక్కలూ అందంగా కనిపిస్తే, నున్నగా ఎంతో శుభ్రంగా ఉంచే తీరు ఆహ్లాదంగా ఉంటుంది.

వంట పని పూర్తి కాగానే తన సహాయకులతో కలిసి శుభ్రం చేశాకా, గదిలో ఒక పక్కగా మెత్తటి పరిమళం వచ్చేలా పెర్ఫ్యూమెడ్ కాండిల్లో, ఆయిల్ డిస్పెన్సర్లో పెడుతుందావిడ.

ఒక రోజు చందన గంధం వస్తే, మరో రోజు లవెండర్, ఇంకో రోజు మల్లెల పరిమళం ఇలా. ఇవన్నీ చూస్తే ఆ వంటగది మీద, తన కుటుంబానికి తయారు చేసే ఆహారం తయారుచెయ్యడంలో ఆవిడకున్న శ్రద్ధా ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉంటాయి.

ప్రతి రోజూ వంట పూర్తికాగానే, కొద్దిగా అన్నం, కూరలూ ఒక చిన్న ప్లేట్ లో పెట్టి బయట పెట్టి వస్తుంది. తన గార్డెన్ లో పాటలు పాడే పక్షుల కోసం. రోజు వారీ బర్డ్ ఫీడర్ భోజనానికి తోడు విందు భోజనం అన్నమాట.

ఎప్పుడూ చిరాకు పడినట్టుగానీ, విసుగు చెందినట్టుగానీ కనిపించదు ఆవిడ.

అందుకే ఎప్పుడూ కేశవరావు తనంత అదృష్టవంతుడు లేడనే అనుకుంటాడు.

" అమ్మా!వినయ్ కూరగాయలు తీసుకు వచ్చాడు, అన్నీ కడిగి ఆరబెట్టేశాను. సాయంత్రానికి ఇప్పుడే కట్ చేసి పెట్టనా, ఆ తర్వాత చేద్దామా?" అంటూ వచ్చింది రత్న.

కేశవరావు ని కిచెన్లో చూసి" అరే సార్ కూడా ఇక్కడే ఉన్నారే, నమస్తే సార్" అంది చిరునవ్వుతో.

" ఏమ్మా, బావున్నావా?" బదులుగా అడిగాడు.

" బావున్నాను సార్" నమ్రతగా చెప్పి, యశోద చెప్పినవి తరగడానికి వెళ్ళిపోయింది ఆమె.

ప్రతీ పనీ చాలా నిబద్ధతతో, పద్ధతిగా చెయ్యాలని అనుకుంటుంది యశోద. ఇంటి పని, తన ప్రాజెక్ట్ ల పనీ, అతిధులు, బంధువులు, ఇతర బయట పనులూ అన్నీ ఒక టైం టేబుల్ వేసుకున్నట్టుగా చక్కబెట్టుకుంటుంది.

తనకే కాక, తనతో కలిసి పనిచేసే వారందరికీ  కూడా తమ ఫేమిలీ టైం, ఆఫీస్ పనీ సమానంగా ఉండాలని భావిస్తుంది.  ఎంత పని ఉన్నా ఎప్పుడూ అందంగా కనిపిస్తూ, ఆహ్లాదంగా చురుగ్గా ఉంటుంది 57 సంవత్సరాల యశోద.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న నమ్మకమే ఆ దంపతులిద్దరిదీ. మధ్యతరగతి మూలాల్లోంచి వచ్చిన యశోద కి మరీ ముఖ్యంగా. మడత నలగని బట్టలతో, అలుపెరగని ఆహ్లాదాన్ని నింపుకున్న ప్రసన్నతతో, ఇంటా బయటా అందరికీ ప్రీతిపాత్రం గా ఉంటూ తననీ, పిల్లలనీ కంటిరెప్పల్లా చూసుకుంటూ తమ జీవితాలకి మూలాధారమైన యశోద.

నిండుకొచ్చిన కళ్ళతో భార్యని గుర్తు చేసుకుంటూ ఎంత సేపు ఉన్నాడో తెలియకుండానే కూర్చుండిపోయాడు ఆయన.అలల మీద నీటిపడవలా అందంగా సాగిపోతున్న జీవితంలో వచ్చిన చిన్న కుదుపు ని ఏనాటికీ మర్చిపోలేదు ఆయన.

" అమ్మా, ఎందుకు ఈ రోజు అలా అలసటగా కనిపిస్తున్నావ్! కొంపదీసి ముసలిదానివైపోతున్నావా?" నవ్వుతూ తల్లిని ఆటపట్టించాడు యశ్.

చిరుకోపంతో తనవైపు చూసిన తల్లిని చూసి మరింత గట్టిగా నవ్వాడు. అతనికి తెలుసు అలా అనడం అమ్మకి నచ్చదని.

" నీ మొహం! అలసటా, నాకా? మీ అమ్మ సంగతి నీకు తెలీదూ!!" అంది నవ్వుతూ.

" ఊరికే అన్నాలే   అమ్మా, ఇంకొక్క దోశ ఇచ్చేస్తే నాదయిపోతుంది. మిగిలినవన్నీ నాన్నకే" అంటూ నవ్వాడు.

" నాన్నా, యామీ ఇందాకే వెళ్ళిపోయారు. తనకేదో  లాబ్ లో  పని ఉందిట. నాన్న దింపేసి వెళతాను అన్నారు. నువ్వే ఈరోజు లేట్" అందావిడ నవ్వుతూ.

" ఓ అవునా! ఓకే" అన్నాడు

" ఇదిగో పట్టు అంటూ అతని ప్లేట్లో వేడి దోశ వేస్తూ, ఇం కోటి ఇవ్వనా?" అంది చిరునవ్వుతో.

" వద్దమ్మా, 'పొట్ట నిండూ' అన్నాడు. నిండిపోయింది అనడం రాక చిన్నప్పుడు అలా అనేవాడు, అదే అలవాటైపోయింది.

తినడం ముగించి " నిజంగానే జోక్ చేశానమ్మ, ఎంత బావున్నావో ఈ లేత ఆకుపచ్చ రంగు సల్వార్ నీకెంత బాగా నప్పిందో! ఏజింగ్ గ్రేస్ఫుల్లీ అన్న మాట నీకే వర్తిస్తుంది. మై బ్యూటిఫుల్ మాం" అంటూ తల్లికి చిన్న హగ్ ఇచ్చి 'బై మా!' అంటూ చెప్పి వెళ్ళిపోయాడు.

కొడుకు మాటలకి నవ్వుకుంది యశోద.

తనకి మొదటినించీ రంగులూ, హంగులూ నచ్చవు. అందుకే ఇప్పుడిప్పుడే నెరుస్తున్న జుట్టునైనా, వయసుతోటి వచ్చే ఇతర మార్పులనైనే ఆహ్వానించింది తప్ప కృత్రిమమైన పద్ధతుల జోలికి పోలేదు.

వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయాకా తనకొక కప్పులో కాఫీ తెచ్చుకుని టేబిల్ దగ్గర కూర్చుని ఆరోజు కార్యక్రమలని చూసుకుంది. సాధారణంగా 11 గంటలకి పని మొదలు పెడుతుందావిడ. మధ్యలో భోజనానికి ఒక అరగంట విరామంతో పాటు ఐదు గంటలవరకూ కొనసాగించి, ఆపైన తన టీం ని ఇంటికి వెళ్ళమని చెప్పి ఆవిడ కూడా ముగిస్తుంది. ఎంతో అవసరమైతే తప్ప ఆతర్వాత పని చెయ్యడానికి ఇష్టపడదు.

తన టైం టేబుల్ చూసుకుంటూ కాఫీ తగుతూ ఉండగా తన ఎడంవైపు ఛాతీలో కొన్ని క్షణాలపాటు సన్నగా నొప్పిగా అనిపించింది. ఎవరో నొక్కి పట్టి వదిలినట్టనిపించే నొప్పి, ఎంత తక్కువ క్షణాలుందంటే నిజానికి ఆవిడ దాన్ని గమనించనేలేనంత. అందుకే పట్టించుకోలేదు, మళ్ళీ కాఫీ తాగుతూ పనిచూసుకోసాగింది.

ఆ రోజు బయటకు వెళ్ళవలసిన పని లేదు అని చూసుకుని హాయిగా ఊపిరి తీసుకుంది. రెండు మూడు ఫోన్ కాల్స్ చేసి తన అనుచరులకి ఇవ్వవలసిన సూచనలు ఇచ్చి, కాసేపు రెస్ట్ తీసుకుందామని గదిలోకి వెళ్ళి పడుకుంది. అలసిపోయినట్టుగా నిద్ర పోయింది వెంటనే. ఒక గంట పడుకుని లేచేసరికి ఫ్రెష్ గానూ, ఉత్సాహంగానూ అనిపించింది ఆవిడకి.

దాంతో ఆ చిన్న సంఘటనని మర్చిపోయింది ఆవిడ. పైగా రాత్రి తమ స్నేహితుల కూతురి ఎంగేజ్ మెంట్ పార్టీ కూడ ఉంది. నగరంలోని ఒక ప్రముఖ ఫైవ్ స్టార్ హోటేల్ లో జరుగుతోంది.

" వాళ్ళు మనకి ఎంత ఫ్రెండ్స్ మీ ఇద్దరికీ తెలుసు, అందుకని ఏ సాకులూ చెప్పడానికి లేదు" అని పిల్లలిద్దరికీ పొద్దున్నే చెప్పేసింది. దాంతో వాళ్ళిద్దరికీ రాకతప్పలేదు.

ఇద్దరిలోనూ యష్ పరవాలేదు, యామినికి మాత్రం ఇలాంటివేమీ పట్టవు, తనూ, తన రిసెర్చ్, స్నేహితులు. ఇంతే. చాలా వైభవంగా జరగబోతోంది ఆ వేడుక. డ్రెస్ కోడ్ అవీ ముందే చెప్పారు.

పెళ్ళికూతురు తన స్నేహితురాలు కనక ఇంక మానేయలేక తయారైంది యామిని.లేకపోతే ఇలాంటి ఆర్భాటాలంటే ఆమెకి గిట్టదు. లేతరంగు పట్టుచీర కట్టుకుని, దానికి మేచ్ అయ్యే నగలు పెట్టుకుని హుందాగా తయారయింది యశోద. యామిని కూడా సన్నని సిల్వర్ ఎంబ్రాయిడరీ చేసిన ఎర్రటి సల్వార్ కమీజ్ వేసుకుంది. మగవాళ్ళిద్దరూ పిలిచేవారి ఆదేశాలమేరకు  డిజైనర్ కుర్తాలు ధరించారు.

నలుగురూ కలిసి బయలుదేరుతుంటే " అందరూ ఎంత బావున్నారో అమ్మా, నా దిష్టే తగిలేలా ఉంది" అంది ఎప్పటినించో తమ ఇంట్లో పని చేసే విజయమ్మ యశోదతో.

“ నీ అభిమానం విజయమ్మ!" అందియశోద చిరునవ్వుతో.

యష్ డ్రైవింగ్ చేస్తుండగా కదిలిన కారు నలుగురి నవ్వులూ, కబుర్లతో జోరెక్కింది.

"అమ్మా! మనం కూడా తొందరపడాలి" అన్నాడు యష్ చిలిపిగా నవ్వుతూ.

" దేనికి?" అంది యామిని అర్థం కానట్టు

" అమ్మకి తెలుసులే, మాఇద్దరికే తెలిసిన పెద్ద సీక్రెట్" అన్నాడు మరింతగా నవ్వుతూ.

కేశవరావు కూడా అర్థం కానట్టుగా యశోద వైపు చూశారు. యశోద కూడా నవ్వింది బదులుగా.

"ఇలా నవ్వడమేనా? మాకూ కాస్త విషయం చెప్తారా?" విసుగ్గా అంది యామిని.

" పెళ్ళి కూతురు శర్మిల నీ స్నేహితురాలు. ఇప్పుడు జరుగుతున్నది తన నిస్చితార్థం. ఇప్పుడు తెలిసిందా?" అన్నాడు యష్.

" దట్ ఈజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్" అంది యామిని కోపంగా.

"అవునవును, ఇద్దరిదీ ఒకే వయసుకూడా" అంది యశోద కూతుర్ని కవ్వించడానికి

" ప్లీజ్ అమ్మా, నువ్వు కూడా ఏమిటి వాడితో సమానంగా"

"ఊరికే అన్నాడు లేరా, అయినా వాడన్నదాంట్లో తప్పేమీ లేదు. బలవంతమేమీ లేదు. నీకు ఎప్పుడు ఇష్టమైతే అప్పుడే, ఎవరు ఇష్టమైతే వారితోనే" అనునయంగా అన్నారు కేశవ్.

అంతలోకే కార్ హోటెల్ లోకి ప్రవేశించింది.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments